క్లుప్తంగా

రేషన్ కార్డులను బదిలీ చేయండి

బి.కొత్తకోట : పట్టణంలోని హడ్కో కాలనీ, పంజూరమ్మ గుడివీధి, బోయవీధులకు చెందిన రేషన్ కార్డుదారుల ఇబ్బందులు తొలగించాలని సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్‌కు విన్నవించారు. తాకటంవారిపల్లి, జనుపువారిపల్లి చౌక దుకాణాల పరిధిలోని 160 రేషన్ కార్డులను బి.కొత్తకోట పట్టణంలోని చౌక దుకాణాలకు మార్పు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి కోరారు. నిత్యవసర సరుకులు తీసుకోవడానికి వీరు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. చౌక దుకాణాలకు మార్పు చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.అ్రఫ్అల్లీ, ఎస్.తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

పీలేరురూరల్ : గత నెల 5న జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో స్థానిక శ్రీ భువన విద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ ఉమారమాదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మీ తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన కె. అచ్యుత్‌కుమార్‌రెడ్డి, వి. అక్షరరెడ్డి, వి.శ్రీదేవి, జి.హిమాను, ఎస్.రయాన్, వి.తనివ్‌రెడ్డి, యశ్వంత్, డి.అశ్వంత్, కార్తికేయ, జి.తనుష్, ఆర్.హర్షవర్ధన్, ఎం.హవ్యాస్, బి. ఇంద్రేష్‌లు ప్రతిభ చూపి 2025–26 విద్యా సంవత్సరానికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నేటినుంచి వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు



బి.కొత్తకోట : మండలంలోని గట్టులో వెలసిన పురాతన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి జూన్ 1 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఆలూరి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ, చెరువు సంఘం అధ్యక్షురాలు శెట్టి నాగలంబిక శుక్రవారం తెలిపారు. వివరాలిలా.. శనివారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసి ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. 25న సింహ వాహనం, 26న శేష వాహనం, 27న గజ వాహనం, 28న శ్రీవారి కల్యాణోత్సవం, గరుడ సేవ, 29న బ్రహ్మ రథోత్సవం, 30న అశ్వ. వాహనం, వసంతోత్సవం, హంస వాహన సేవ, 31న ఏకాంత సేవ, జూన్ 1న పుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. బ్రహ్మోత్సవాలకు స్వామివారికి టీటీడీ తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

మహాభారత మహాయజ్ఞం ప్రారంభం



హరికథ చెబుతున్న భాగవతారిణి స్వర్ణలత

మదనపల్లె సిటీ: మహాభారత మహాయజ్ఞం కార్యక్రమం స్థానిక నీరుగట్టువారిపల్లె మైదానంలో ప్రారంభమైంది. ప్రముఖ భాగవతారిణి స్వర్ణలత ఆదిపర్వం, భీష్మ ప్రతిజ్ఞ, భీష్మ విజయం హరికథరూపంలో వివరించారు. మొదట నిర్వాహకుల గణపతి పూజ చేశారు. సాయంత్రం కురుపాండవ జననం నాటకం ప్రదర్శించారు. మహాభారత యజ్ఞం తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి

తంబళ్లపల్లె: ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 200 మందికి యోగాపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల28వ తేదీ మదనపల్లె డివిజన్ స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి 200 మందిని పంపేందుకు ఇద్దరు పీడీలను నియమించినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమాలు నెలపాటు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ–2 నాగసుబ్బరాయుడు, మెడికల్ ఆఫీసర్ అనుపమ, అగ్రికల్చర్ ఏఓ రమణకుమార్, కార్యాలయ ఏఓ థామస్, ఏఈఈలు వినోద్‌కుమార్, సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆదర్శంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న ముస్లింలు



ముస్లింలు పంపిణీ చేసిన శీతల పానీయాలు

మత సామరస్యంతో మురిసిన మదనపల్లె

మదనపల్లె : మత సామరస్యానికి, సోదర భావానికి మదనపల్లెలో గురువారం రాత్రి జరిగిన హనుమాన్ శోభాయాత్ర ఆదర్శంగా నిలుస్తోంది. కులం లేదు–మతం లేదు..మనుషులంతా ఒక్కటేరా..ఈశ్వర్ – అల్లా వేరుకాదు..దేవుడంటే ఒక్కడేరా అన్నట్లుగా మతాల మధ్య పరస్పర గౌరవం చాటుకున్నారు. స్థానిక రామాలయం నుంచి మొదలైన శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా రాత్రి 8:30 గంటల వరకు సాగింది. ఈ యాత్రను పురస్కరించుకుని ముస్లింలు ఘనంగా స్వాగతం పలికారు. యాత్ర సాగే ప్రాంతాల్లో స్వాగతం పలుకుతూ బ్యానర్లు కట్టారు. హిందూ చైతన్య వేదిక, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు, హిందూ సోదరులతో వస్తున్న శోభాయాత్ర తమ వీధుల్లోకి రాగానే ముస్లింలు సాదర స్వాగతం పలుకుతూ ఆత్మీయ అలింగనం చేసుకున్నారు. శాలువాలతో సత్కరించారు. శోభాయాత్రపై పూల వర్షం కురిపించారు. మంచినీటి బాటిళ్లు, మజ్జిగ, శీతల పానీయాలు అందించారు. సోదర భావానికి మతం అడ్డు కాదని, అందరం ఒకటేనని చాటి చెప్పారు. జామియా మసీదు, ఉస్మాన్ – ఏ–ఘని మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. మదనపల్లెలో జరిగిన హనుమాన్ శోభ యాత్ర దేశం గర్వించే విధంగా పరమత సహనమే మా నినాదమని చాటి చెప్పిందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన కార్యక్రమంగా అభివర్ణించారు. హిందూ–ముస్లిం భాయి భాయి అంటూ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

దండుమారెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజా సామగ్రి తీసుకొస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ దేవరబురుజు బస్టాండులో గ్రామస్తులు నిర్మించిన నూతన ఆలయంలో శుక్రవారం దండుమారెమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా హోమాలు నిర్వహించి అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. వేదపండితులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పూజాసామగ్రిని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు పుష్కలంగా కురిసి పల్లెలు పాడిపంటలతో కళకళలాడాలని మొక్కుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అందరూ ఐక్యమత్యంగా కూటమి ప్రభుత్వ రాక్షస పాలనపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి ఏ మాత్రం పట్టించుకోకుండా అన్ని వర్గాలను మోసం చేసి తమ మోసాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ నేతలు డైవర్ట్ పాలిటిక్స్ నడుపుతున్నారన్నారు. అక్రమ కేసులతో వేధింపులతో భయకంపితులను చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ బోలపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీరాములురెడ్డి, ఎర్రంరెడ్డి, సుబ్బారెడ్డి, ధనశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి, రఘు, నాయకులు సురేంద్రనాథ్, చౌడేశ్వర్, రామమూర్తి, రమణారెడ్డి, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ, ఆరోగ్యశాఖ సిబ్బంది

గుర్రంకొండ: యోగాతో మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో అంగన్‌వాడీలు, ఆరోగ్యశాఖ సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే వేడుకల్లో పాల్గొనే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నెలరోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జీవితంలో యోగా ఒక భాగంగా భావించి ఆచరిస్తే మంచి ఆరోగ్య ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడీ రమేష్, వైద్యాధికారి రాజకుమారి, యోగా శిక్షకుడు హిదాయతుల్లా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యమ్మ సూచించారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె మండలంలోని రంగసముద్రం పంచాయతీ కొత్త సుబ్బరాయునిపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చాలా మంది తల్లిదండ్రులు వివాహంపై ఎలాంటి అవగాహన లేని బాలికలకు చిన్న వయసులోనే పెళ్ళి అనే బంధంతో ముడి వేసి భారం తగ్గించుకోవాలనుకోవడం సరైంది కాదన్నారు. అలా పెళ్ళిళ్ళు చేసుకున్న అనంతరం బాలికలు ప్రసవ సమయంలో ఎన్నో ఇబ్బందులకు గురై అనారోగ్యం పాలవుతున్నారని గుర్తు చేశారు. అనంతరం మహిళల చట్టాలు, ఫోక్సో కేసులపై అవగాహన కల్పించారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు జయరాణి పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న కళాజాత ప్రదర్శన



గుర్రంకొండ వారపు సంతలో కళాజాత బృందం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో నిర్వహించిన కళాజాత ఆకట్టుకొంది. శుక్రవారం స్థానిక వారపు సంతలో టీబీ, ఎయిడ్స్, హెచ్‌ఐవీ వంటి వ్యాధులపై కేసి నటరాజన్ కళాబృందం వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధులు ఎలా వస్తాయి, ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో వివక్ష ఉండకూడదు వంటి అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. టీబీ లక్షణాలున్న రోగులకు ప్రభుత్వం పోషణభయాన్ పథకం కింద రూ. 1000 ప్రతినెలా ఇస్తుందని, ఈ డబ్బులను పోషణ మిత్ర అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణ చైతన్య, సీహెచ్‌వో సీతారామయ్య, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఆరోగ్యసిబ్బంది శ్రీనివాసులు, పరిమళ, చంద్రనాగమ్మ, గాయత్రి, భారతి, రేఖ, సావిత్రి, కృష్ణవేణి, సురేష్, కళాకారులు పాల్గొన్నారు.

క్షయపై వంద రోజుల కార్యక్రమం



ఈశ్వరమ్మ కాలనీలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా త్వరలో క్షయవ్యాధిపై వందరోజుల కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు బొమ్మనచెరువు వైద్యాధికారి ఫుర్ఖాన్ ఖాన్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, రూరల్ మండలం ఈశ్వరమ్మ కాలనీలో క్షయ వ్యాధిపై కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగేవారు, బిఎంఐ– 18 కన్నా తక్కువ ఉన్నవాళ్లు, ఐదేళ్ల క్రితం వ్యాధి సోకిన వారికి గళ్ళ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వ్యాధిగ్రస్తులకు కేంద్ర ప్రభుత్వం నిక్షయ్ పోషణ యోజన కింద నెలకు రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ, వైద్య సిబ్బంది రెహమాన్, పురుషోత్తం, ప్రభాకర్, సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత, ప్రజలు పాల్గొన్నారు.

ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న లోకనాథం

పీలేరు రూరల్ : పేద విద్యార్థులకు అందించాల్సిన తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల కడుపు కొడుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షులు లోకనాథం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరానికి తల్లికి వందనం గానీ, ఫీజు రీయిబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. పేద విద్యార్థులు ఫీజులు చెల్లించడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజలు చెల్లించలేదని కళాశాలల్లో విద్యార్థులకు యజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని ఇకనైనా కళ్లు తెరచి విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయిబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు ధనుష్, కుశాల్, సంజీవ్ పాల్గొన్నారు.

గడికోటలో గంగమ్మ జాతర

వీరబల్లి : మండలంలో గడికోట పంచాయతీలో ఎడబల్లె సమీపంలో వెలసిన గంగమ్మ జాతరను శుక్రవారం ప్రారంభమైంది. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పలువురు భక్తులు చాందినీ బండ్లు కట్టి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలు ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ జడ్జి సీవీ నాగార్జున రెడ్డి, స్థానిక నాయకులు రాజీవ్ రెడ్డి, నరేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు పేర్కొన్నారు. మండలంలోని భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి దీవెనలు అందుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు యూనిట్‌లోని మడితాడు వీఓ–1 వద్ద కేపీపీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పీఎండీఎస్, నవధాన్యాలు, విత్తన గుళికలు తయారు విధానం గురించి వీహెచ్ఏ రామకృష్ణ అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం అధిక ఖర్చుతో కూడుకున్నదని, అందువల్ల ప్రతి రైతు తక్కువ ఖర్చుతో పీఎండీఎస్ విధానంలో నవధాన్యాలు వేసుకొని కాషాయాలు, ద్రావణాలు వాడి వ్యవసాయం చేయాలని తద్వారా మన ఆరోగ్యం కాపాడుకోవచ్చని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానాన్ని అవలంబించి గత రెండు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎగువ నాయునివారిపల్లెకు చెందిన కొండయ్యనాయుడు, రాయవరం జంగంపల్లికు చెందిన రైతు వీరభద్రయ్యను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు నవీన్, కోటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జి ఎస్.వెంకటయ్య, ఐసీఆర్‌పీలు శివరాంప్రసాద్, వీరనాగయ్య, రామచంద్ర, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, వీఓఏలు రమణమ్మ, నాగమునెమ్మ, నాగేశ్వరి, ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

దొంగ పాసుపుస్తకాలు జారీ చేసిన వ్యక్తికి రిమాండ్

సుండుపల్లె : మండల తహసీల్దార్ కార్యాలయంలో దొంగ పాసు పుస్తకాలు జారీ కేసులో గతంలో అటెండర్‌గా పనిచేసిన పూజారి నాగన్నపై సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి రాయచోటి కోర్టు వారు పూజారి నాగన్నకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు చెప్పారు. మండల వ్యాప్తంగా కొంతమంది రైతుల వద్ద నుంచి భూమికి పాసు పుస్తకాలు చేయిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి దొంగ పాసుపుస్తకాలు జారీ చేయించిన కేసులో అరెస్టు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు.

రేషన్‌షాపుల్లోనే నిత్యావసర సరుకులు

తహసీల్దార్ ధనంజయులు



మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె రూరల్ : జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్‌షాపుల ద్వారానే ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ ధనంజయులు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సివిల్ సప్లయిస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షతన మండలంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకతతో ఉండేలా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా రేషన్‌షాపుల్లోనే సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ డీలర్లు..ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్‌షాపు తెరచి ఉంచాలన్నారు. రేషన్ డీలర్లు తమ పరిధిలోని కార్డుదారులు 15వ తేదీలోపు ఎప్పుడు వచ్చినా బియ్యం, సరుకులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ, కార్డుదారులందరితో మర్యాదపూర్వకంగా మాట్లాడి ఎలాంటి సమస్యలు లేకుండా పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మదనపల్లె మండలం, అర్బన్ కలిపి 101 రేషన్‌షాపులు ఉన్నాయన్నారు. అన్ని షాపుల్లోనూ ప్రభుత్వ నిర్ణీత ధరలకు సకాలంలో సరుకులు అందించాలన్నారు. అలాగే జూన్ 1న రేషన్ షాపుల్లో బియ్యం, సరుకుల పంపిణీ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశం అనంతరం రేషన్‌డీలర్లు...సివిల్ సప్లయిస్ డీటీ ఫిరోజ్‌ఖాన్‌ను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్ల సంఘం నాయకులు మౌలాలి, ఖాజాహుస్సేన్, కళాధర్, ముంతాజ్, కవిత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం



బిలాల్ మసీదు ఆవరణలో ముస్లిం సోదరులతో మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేస్తామని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని వలసపల్లె బిలాల్ మసీదులో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ముస్లింల ఆహ్వానం మేరకు పవిత్ర శుక్రవారం సందర్భంగా బిలాల్ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ పలుకరించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...ప్రతి ముస్లిం శుక్రవారం నమాజును అత్యంత పవిత్రకార్యంగా భావిస్తాడన్నారు. పండుగరోజు ప్రార్థనలకు అందరూ ఎలాగైతే తప్పనిసరిగా ప్రార్థనలకు హాజరవుతారో, శుక్రవారం ప్రార్థనలకు అంతే ప్రత్యేకత ఉందన్నారు. అనంతరం వలసపల్లె పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం దిశగా చర్చించారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు కూటమిప్రభుత్వ వైఫల్యాలనుఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజరెడ్డి, సురేంద్రరెడ్డి, రమణారెడ్డి, రహంతుల్లా, జహీర్, షానవాజ్, నవాజ్, ఫయాజ్, యూనస్, హబీబ్, నసీర్, సాదిక్, అబ్దుల్లా, జబివుల్లా, ఖిజ్రీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న వర్రి సురేష్‌కుమార్

మదనపల్లె రూరల్ : మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ కోరారు. శుక్రవారం పట్టణంలోని చలపతిరావు కాలనీలోని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ...కరోనా సమయం నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. కూలిడబ్బులు మీద ఆధారపడి జీవనం సాగించే దినసరి కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే, కుటుంబపోషణ ఎలా సాగించాలని ప్రశ్నించారు. డైలీ వేజెస్ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకుని, కార్మికుల సంఖ్యను పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేదిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మె...కొన్ని కారణాలతో జూలై 9వ తేదీకి వాయిదాపడిందన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, మదనపల్లె ప్రధాన కార్యదర్శి నాగరాజు, మధు, ఓబులేష్, శేఖర, నందు, శ్రీరాములు, ప్రమీల, అన్నపూర్ణ, అనూరాధ, ఈశ్వరమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధికి పరిశోధనలు



పరిశోధన పత్రాలను ఆవిష్కరిస్తున్న కాలేజీ డైరెక్టర్ తదితరులు

మదనపల్లె సిటీ: సాంకేతిక అభివృద్ధికి పరిశోధనలు అవసరమని, కాలానుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు కొత్త అభ్యాసలపై దృష్టి పెట్టాలని తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో రీసర్చ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. పరిశోధనల ప్రాముఖ్యతను వివరిస్తూ అంతర్జాతీయస్థాయిలో భారత విద్యా వ్యవస్థ ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఇటువంటి సదస్సు ద్వారా ప్రతిభను ప్రదర్శించగలుగుతారని తెలిపారు. ఈ సదస్సు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, కన్వీనర్లు డాక్టర్ గంగాధర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. సెమినార్‌లో వందపత్రాలు సమర్పించారు. పలు రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరయ్యారు.

మార్కెట్ వద్ద స్తంభించిపోతున్న ట్రాఫిక్



చౌడేశ్వరి సర్కిల్ వద్ద ఆగిపోయిన వాహనాలు –పట్టించుకోని మార్కెట్, ట్రాఫిక్ పోలీసులు

మదనపల్లె సిటీ: మదనపల్లె టమటా మార్కెట్ వద్ద ప్రతి రోజు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. దీంతో ప్రయాణికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు ఇటీవల అధికంగా రైతులు టమటాలను వాహనాల్లో తెస్తున్నారు. దీంతో అన్నమయ్య సర్కిల్ నుంచి మార్కెట్ వరకు టమటా కాయల లోడ్ల వాహనాలు వందల సంఖ్యలో నిలిచిపోతున్నాయి. వాహనాలను ఒక వైపుమాత్రమే పంపి మిగిలిన వాహనాలు పంపితే ట్రాఫిక్ సమస్య ఉండదు. వాహనాలు రోడ్డుకు అడ్డదిడ్డంగా పెట్టడంతో వాహనాలు ఆగిపోతున్నాయి. వారం రోజుల నుంచి మార్కెట్‌కు భారీ ఎత్తున వస్తున్నాయి. శుక్రవారం 1162 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. దీనికి అనుగుణంగా ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు మార్కెట్, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలి. అయితే వారం రోజులుగా ఇదే సమస్య ఎదురవుతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రైతులకు సలహాలు, సూచనలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శుక్రవారం రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థాన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ హాజరయ్యారు. పలువురు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలను ప్రాంతాల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. రైతుల కోసం చేపట్టాల్సిన పరిశోధన విస్తరణ కార్యక్రమాల భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తున్నామని, రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టామని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.